# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 25-08-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ భారత దేశం అంతరిక్ష రంగంలో అద్భుతాలు సృష్టిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- ❖ శ్రీకాకుళం జిల్లా అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.
- ❖ రాష్ట్రంలో లక్షా 22 వేల మంది స్వయంశక్తి మహిళలను లక్షాధికారులుగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.
- ❖ పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిని త్వరలో అందుబాటులోకి తెస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు ప్రకటించారు.
- ❖ రానున్న రెండు రోజుల్లో ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తాలోని పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలియజేసింది.

===================

భారత దేశం అంతరిక్ష రంగంలో అద్భుతాలు సృష్టిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. చంద్రుడి దక్షిణ ధ్రువంపై దిగిన తొలి దేశంగా భారత్ చరిత్ర సృష్టించిందని వెల్లడించారు. ఆకాశవాణిలో ఈ రోజు ప్రసారం అయిన "మన్ కీ బాత్" 113వ సంచిక ద్వారా ఆయన అనేక విషయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రయాన్-3 విజయానికి గుర్తుగా ప్రతీ సందర్భంగా అంతరిక్ష దినోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. అంతరిక్ష శాస్త్ర విజ్ఞానం పట్ల యువత ఆకర్షితమవుతోందని.... పేర్కొన్నారు. కాగా, తెలుగు ప్రజలు ఆగస్టు 29న తెలుగు భాష దినోత్సవం జరుపుకుంటారని నరేంద్ర మోదీ గుర్తు చేస్తూ.. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారికి తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు

(వాయిస్ 28 సెకన్లు)

అదే విధంగా ఈ సంవత్సరం "హర్ ఘర్ తిరంగా" ప్రచారం పెద్ద ఎత్తున చేపట్టామని, ఆ పిలుపును అందుకుని ఇళ్లు, దుకాణాలు, కార్యాలయాల వద్ద ప్రజానీకం జెండాలు ఆవిష్కరించారని పేర్కొన్నారు. వికసిత్ భారత్ సాకారానికి కూడా ప్రజలు కలసి పనిచేయడం ద్వారా స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని చాటాలని నరేంద్ర మోదీ పేర్కొంటూ....

(వాయిస్ 28 సెకన్లు)

==================

శ్రీకాకుళం జిల్లా అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాటశాలలో ఈ రోజు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దేశంలోనే ఆదర్శవంతమైన జిల్లాగా శ్రీకాకుళంను తయారు చేస్తామని అన్నారు. అదే విధంగా ఎచ్చెర్ల నియోజక వర్గంను విద్యా కేంద్రంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

==================

రాష్ట్రంలో లక్షా 22 వేల మంది స్వయంశక్తి మహిళలను లక్షాధికారులుగా తీర్చిదిద్దాలని ఈ సంవత్సరం లక్ష్యంగా పెట్టుకున్నామని రాష్ట్ర సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మహారాష్ట్రలోని జల్‌గావ్ నుంచి దేశంలోని అన్ని జిల్లాల మహిళా సమాఖ్యలతో ఈ రోజు దృశ్య మాధ్యమం ద్వారా నిర్వహించిన సమావేశంలో విజయనగరం డి.ఆర్.డి.ఏ. సమావేశ మందిరం నుంచి మంత్రి కొండపల్లి జిల్లాపరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్, జిల్లాలోని మహిళా స్వయంశక్తి సభ్యులతో పాల్గొని పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గ్రామాల్లో ఉన్న మహిళలను లక్షాధికారులుగా చేయడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలను చేపడుతున్నాయని అన్నారు. వారికి ప్రత్యేకమైన నిధులు ఇస్తూ.. జీవనోపాధికి సంబంధించిన కార్యక్రమాలు చేపట్టేలా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. విజయనగరం జిల్లా నుంచి 83 వేల 291 మందిని లక్షాధికారులుగా మార్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తు న్నామని మంత్రి తెలిపారు.

విరామం

==================

పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులు పూర్తి చేసి ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తెస్తామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి డాక్టరు నిమ్మల రామానాయుడు తెలిపారు. పాలకొల్లులో వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులను మంత్రి ఈ రోజు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 1998లో 30 పడకల హాస్పటల్ నుండి 50 పడకల ఆసుపత్రిగా పెంచారని, 2019లో 50 పడకల ఆసుపత్రి నుంచి వంద పడకలగా పెంచుతున్నామని తెలిపారు. నాబార్డు సహాయంతో రూ 12.60 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించామని అన్నారు. క్రొత్త ఆసుపత్రిలో 4 వార్డులు, ఒక ఆపరేషన్ థియేటరును అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించామని తెలిపారు.

==================

మహిళల అభ్యున్నతి మాటలలో కాకుండా చేతలలో చూపాలనే కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి ప్రతిరూపమే 2023 లో ప్రారంభించిన లఖ్ పతి దిది కార్యక్రమం. ఈ కార్యక్రమం కింద లబ్ది పోందిన వారితో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు మహారాష్ట్రలోని జల్గావ్ నుంచి నేరుగా మాట్లాడి వారిలో స్ఫూర్తి నింపారు. ఈ సందర్భంగా గుంటూరు రూరల్ మండలంలోని మహిళా సహాయక సంఘాల ప్రతినిధి మంచాల అశ్విని ఆకాశవాణితో మాట్లాడుతూ, ఇటువంటి కార్యక్రమాల ద్వారా తమ సంఘాలు అభివృద్ధి పథంలో పయనిస్తాయని పేర్కొంటూ..

(వాయిస్ 26 సెకన్లు)

కాగా, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ....... జరిగిన "లఖ్ పతి దీదీ" కార్యక్రమంలో కలెక్టరు ఎ.శ్యామ్ ప్రసాద్ మహిళా సంఘాలకు 66.14 కోట్ల రూపాయలు చెక్కును అందజేసారు.

ప్రకాశం జిల్లాలోని పొదుపు సంఘాలలోని మహిళలను లక్షాధికారులను చేయడానికి కార్యాచరణ రూపొందించామని ఆ జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు.

==================

ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రంలోని ప్రాంతీయ వార్తా విభాగంలో క్యాజువల్ న్యూస్ రీడర్, క్యాజువల్ బ్రాడ్‌క్యాస్ట్ అసిస్టెంట్ పోస్టులకు సంబంధించి ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని విభాగాధిపతి శ్రీ సాయి వెంపాటి ఒక ప్రకటనలో తెలిపారు. క్యాజువల్ న్యూస్ రీడర్ పోస్టుకు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీతో పాటు, తెలుగు, ఆంగ్ల భాషల్లో నైపుణ్యం, మంచి స్వరం కలిగి ఉండాలని స్పష్టం చేశారు. అలాగే రేడియో, టీవీ జర్నలిజంలో అనుభవం ఉండాలని, తెలుగు టైపింగ్ తో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలని తెలిపారు.

కాగా 21 నుంచి 50 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వారు ఈ పోస్టులకు ధరఖాస్తు చేసుకోవచ్చనన్నారు. అదేవిధంగా క్యాజువల్ బ్రాడ్‌క్యాస్ట్ అసిస్టెంట్ పోస్టుకు రెడియో ప్రొడక్షన్‌లో ఏదైనా డిగ్రీ, లేదా డిప్లమా అర్హత కలిగి ఉండాలని, తెలుగు, ఆంగ్ల భాషల్లో ప్రావీణ్యం, కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలని తెలిపారు. అలాగే ఆడియో రికార్డింగ్, ఎడిటింగ్‌లో అనుభవం ఉండాలని సూచించారు. ధరఖాస్తులను సిరిపురంలోని ఆకాశవాణి, విశాఖపట్నం కేంద్రానికి పోస్టల్ ద్వారా సెప్టెంబరు 3వ తేదీలోగా పంపించాలని కోరారు.

==================

విశాఖ మెడ్‌టెక్ జోన్ మరో ఘనతను సాధించింది. కరోనా సమయంలో ఆరోగ్య రంగానికి అవసరమైన అనేక దేశీయ ఉత్పత్తులను అందించిన మెడ్‌టెక్ జోన్ తాజాగా మంకీపాక్స్ నిర్ధారణ కోసం దేశీయంగా తొలి ఆర్టీ – పీసీఆర్ కిట్‌ను ఉత్పత్తి చేసింది. తమ భాగస్వామ్య సంస్థ ట్రాన్సేషియా డయాగ్నస్టిక్స్ ప్రైవేటు లిమిటెడ్‌తో కలిసి ఎర్బాఎండీఎక్స్ మంకీపాక్స్ ఆర్టీ – పీసీఆర్ పేరుతో ఈ కిట్‌ను అభివృద్ధి చేసింది. మంకీ పాక్స్ నిర్ధారణకు దేశీయంగా రూపొందించిన తొలి టెస్టింగ్ కిట్ ఇదేనని మెడ్‌టెక్ సంస్థ ప్రకటించింది. ఈ కిట్ కు ఐసీఎంఆర్, సీడీఎస్‌సీవో నుండి అత్యవసర అంగీకారం లభించినట్లు సంస్థ పేర్కొంది. ఆరోగ్య రంగంలో మన దేశ ప్రతిభకు ఇదే తార్కాణమని మెడ్‌టెక్ సీఈవో జితేంద్ర శర్మ అన్నారు. రెండు వారాల్లో ఈ కిట్ ను మార్కెట్‌లో అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.

==================

రాష్ట్రంలో రానున్న రెండు రోజుల్లో ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తాలోని పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం పేర్కొంది. ఝార్ఖండ్ పరిసర ప్రాంతాలపై కొనసాగుతున్న అల్పపీడనానికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని తెలిపింది. దీని ప్రభావంతో ఉత్తర కోస్తాంధ్ర, దక్షిణ కోస్తాంధ్ర తీరంలో గంటకు 45 నుంచి 55 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది.

==================
==================